## క్లుప్తంగా

### ఆంగ్లభాషపై పట్టు సాధించాలి


మాట్లాడుతున్న ఇన్‌స్టిట్యూట్ అఫ్ ఇంగ్లిష్ సంస్థ డైరెక్టర్ రామేశ్వర్ గౌడ్

**కడప ఎడ్యుకేషన్:** ఆంగ్లభాషపై పట్టు సాధించి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇంగ్లీష్‌లో మాట్లాడేటట్లు తర్ఫీదు ఇవ్వడమే తమ లక్ష్యమని విల్ టు కేన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ సంస్థ డైరెక్టర్ రామేశ్వర్ గౌడ్ అన్నారు. ఆదివారం కడప కార్పొరేషన్ సమావేశ మందిరంలో దాదాపు 400 మంది ఉపాధ్యాయులతో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో పదివేలకు పైగా ఉపాధ్యాయులకు ఇప్పటివరకు ఉచితంగా ఆంగ్లభాషా నైపుణ్యాలపై శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులకు ఆంగ్లభాష నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వడం ద్వారా వారు విద్యార్థులకు నేర్పిస్తారని అందుకే వారికి పూర్తి ఉచితంగా 40 రోజుల ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. సమగ్రశిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి వీరేంద్ర మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు ,ప్రమోషన్లు జరుగుతున్నప్పటికీ అధిక సంఖ్యలో హాజరు కావడం సంతోషకరమన్నారు. ఉపాధ్యాయులు తాము నేర్చుకున్న దాన్ని తరగతి గదిలో విద్యార్థులకు చెప్పాలని సూచించారు. కడప ఇంగ్లిష్ ఫోరం నాయకులు సురేష్ బాబు, వెంకటేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు నిరంతర శిక్షణ ఎంతో ఉపయోగకరమని చెప్పారు. సమావేశంలో కడప ఇంగ్లిష్ ఫోరం నాయకులు రవి, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

### కరోనా, వర్షాలతో జాగ్రత్త


విద్యార్థినులకు దుస్తులు అందజేస్తున్న పాస్టర్ మహేష్


**కడప కల్చరల్ :** కరోనాతోపాటు ప్రస్తుతం కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పాస్టర్ మహేష్, సిస్టర్ శాంతమ్మలు సూచించారు. ఆదివారం కడప నగరం కృపా కాలనీలోని న్యూ నేటివ్ కృపా చర్చిలో ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ మహేష్ మాట్లాడుతూ దైవం సానుకూలంగా కనికరిస్తే ప్రజలంతా ఆరోగ్యంతోపాటు పాడి పంటలు కూడా చేతికి అందగలవని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రధానంగా ఇటీవల జిల్లాలో కురుస్తున్న వర్షాల పట్ల పలు జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్నారులను సంరక్షించుకునేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. కరోనా మహమ్మారి పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఈ విషయంగా దైవాన్ని ప్రత్యేకంగా ప్రార్థించాలని కోరారు. ప్రార్థనలకు హాజరైన పిల్లలకు వస్త్రదానంతో పాటు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బేడ బుడగజంగం సంక్షేమ సంఘం జిల్లా నాయకులు డి.శ్రీరాములు, దూపం రాజు, విశ్వాసులు పి.రవితేజ, శాంతిరాజు, ఏ.అగస్టిన్, అంజినమ్మ, సుగుణమ్మ, రామంజీనమ్మ తదితరులు పాల్గొన్నారు.

### వైద్య శిబిరానికి విశేష స్పందన


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మహబూబ్‌అలీ

**కడప ఎడ్యుకేషన్:** కడప నగరం మెడికేర్ ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ మహబూబ్ అలీ రోగులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. వైద్య శిబిరంలో చాలా మందికి షుగర్, కొలెస్ట్రాల్, నరాల పటుత్వ పరీక్షలను నిర్వహించారు. రూ. 2 వేలు విలువ చేసే లివర్ ఫైబ్రోస్కేన్ పరీక్షను కూడా ఉచితంగా నిర్వహించారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మహబూబ్‌అలీ మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ అధినేత సుబ్బరాయుడు, వైద్య సిబ్బంది ఆయేషా, గౌతమి, శిరీష్‌రెడ్డి, భార్గవి, వైష్ణవి, సబిహా, మాధవి, మహిత పాల్గొన్నారు.

### ఇరిగేషన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


మంత్రి నిమ్మల రామనాయుడుతో ఏపీ ఎన్జీఓ అసోషియేషన్ నాయకులు

**కడప రూరల్:** ఇరిగేషన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు కోరారు. ఆదివారం స్థానిక ఇరిగేషన్ అతిథి గృహంలో ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామనాయుడును ఎన్జీఓ అసోషియేషన్ నేతలు కలిసి, ఆయనను సన్మానించారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖ ఉద్యోగులకు సంబంధించిన పదోన్నతులు ఇతర సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం కడప నగర కార్యదర్శి సైలేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు పద్మనాభం, కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

# సీమపై ఇంత నిర్లక్ష్యమా..?

- మహానాడులో సీమ అభివృద్ధిపై స్పష్టమైన ప్రకటన చేయాలి
- పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి
- కడపలో ఉక్కు పరిశ్రమ నెలకొల్పాలి
- వామపక్ష, ప్రజా సంఘాల నేతల డిమాండ్


అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

**కడప ఎడ్యుకేషన్:** విభజన చట్ట ప్రకారం కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై మహానాడులో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ప్రకటన చేయాలని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. అదేవిధంగా కడప బెంగళూరు రైల్వే పనులు ముందుకు సాగకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కడప జిల్లాలో ప్రభుత్వ రంగంలో భారీ ఉక్కు పరిశ్రమ నిర్మాణంతో పాటు బెంగళూరు కడప రైల్వే పనులు కడప నుంచి అమరావతి వరకు పొడిగించాలని కోరుతూ ఆదివారం కడప నగరంలోని కొత్త బస్టాండ్ సర్కిల్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏపీ వెనుకబడిన ప్రాంతల అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడో సారి అధికారంలోకి వచ్చిన విభజన హామీలను మాత్రం అమలు చేయడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న కూడా రాష్ట్ర ప్రయోజనాలకోసం ప్రజాప్రతినిధులు నోరు మెదపకపోవడం దారుణమన్నారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అయితే ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి దొరికే అవకాశం ఉందన్నారు. మహానాడు వేదికగా కడప ఉక్కు పరిశ్రమపై చర్చ జరపాలని లేని పక్షంలో అన్ని విద్యార్థి యువజన ప్రజా సంఘాలను కలుపుకొని ఆందోళనకు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీవి రమణ, అవారు మల్లికార్జున సగిలి గుర్రప్ప, అంజి, శ్రీనివాసులు, జయవర్ధన్, డబ్ల్యూ రాము, దేవర కృష్ణ, రసూల్, డీఎం ఓబులేష్, సగిలి రాజేంద్రప్రసాద్, దస్తగిరి, నాగేంద్ర, జగదీష్, లెనిన్ ప్రసాద్, ప్రభాకర్ రెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

**రాయలసీమ అభివృద్ధిపై మాట్లాడకపోవడం సిగ్గుచేటు**

శ్రీ బాగ్ ఒప్పందం, రాయలసీమ అభివృద్ధిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాట్లాడకపోవడం సిగ్గుచేటు అని ఈ నెల 27వ తేదీ నుంచి నిర్వహించనున్న మహానాడులో చర్చించాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ రాయలసీమ ముఖ్యమంత్రులు అయినప్పటికీ ఈ ప్రాంతంపై స్పందించకపోవడం రాయలసీమను మోసం చేసినట్టేనని తెలిపారు. రాయలసీమకు గత 100 సంవత్సరాలుగా అన్యాయం జరుగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి ఓట్లు సీట్లను మాత్రమే ఉపయోగించుకుంటున్నారే తప్పా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

**ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి**

**కడప రూరల్:** రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయించడంతో పాటు కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై, మహానాడులో ప్రకటన చేయాలని రాయలసీమ ప్రజా సంఘాల ఐక్య వేదిక నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అవ్వారు మల్లిఖార్జున, జేవీ రమణ, ఓబులేసు యాదవ్ మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం నిత్యం కరువు వలసలతో అల్లాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్టులకు నిధులను కేటాయించకపోవడం దారుణమన్నారు. కడప బెంగళూరు రైల్వే లైన్‌ను అమరావతి వరకు కొనసాగించాలని కోరారు. కడపలో సెంట్రల్ యూనివర్శిటీని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మహానాడులో రాయలసీమ డిక్లరేషన్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎం ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రజా సంఘాల ఐక్య వేదిక నేతలు

## ఉత్సాహంగా వైటాథాన్ రన్

**కడప కోటిరెడ్డి సర్కిల్ :** కడప నగరంలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో రెటినాబ్లాస్టోమా (కంటిక్యాన్సర్) ముందస్తు గుర్తింపుపై అవగాహన కల్పించారు. ఆదివారం కడప ఆర్ట్స్ కాలేజీ వద్ద జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు జెండా ఊపి వైటాథాన్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ఎల్‌వీ ప్రసాద్ కంటి నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వారు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. వైద్య పరమైన సమస్యలపై తరచూ ప్రజల్లో అవగాహన కల్పించేలా కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు. కడపలోని రాజశేఖర రెడ్డి క్యాంపస్ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ కావ్య మాధురి బెజ్జంకి మాట్లాడుతూ రెటినోబ్లాస్టోమా లక్షణాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు. యువత, తల్లిదండ్రులకు అవగాహన చాలా ముఖ్యమని, పిల్లల కంటిలో తెల్లని ప్రతిబింబం కనిపించిన వెంటనే కంటి నిపుణుడితో పరీక్షించడం అవసరమన్నారు. వైటాథాన్‌లో పాల్గొనడం ద్వారా పొందిన అవగాహనను మన స్నేహితులతో పంచుకుంటే కేసులను ముందుస్తుగా గుర్తించి చికిత్స చేయడం ద్వారా కంటి దృష్టిని, ప్రాణాన్ని కాపాడటంలో పెద్ద మార్పు తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. వైటాథాన్ రన్ ద్వారా సేకరించిన నిధులను ఆర్థికంగా వెనుకబడిన పిల్లలకు రెటినోబ్లాస్టోమా చికిత్సను ఉచితంగా అందించడానికి, భవిష్యత్తు పరిశోధనకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఆర్ట్స్ కాలేజీ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌వీ ప్రసాద్ నేత్రవైద్య విజ్ఞాన సంస్థ డాక్టర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్ డాక్టర్ నాగరాజు, డాక్టర్ కావ్య మాధురి

## పిచ్చమ్మ ఇంటిని కూల్చిన వారిని శిక్షించాలి

**కడప వైఎస్‌ఆర్ సర్కిల్/కడప సెవెన్‌రోడ్స్ :** కడప నగరం శివానందపురంలో దళితులైన వృద్ధ మహిళలు నివాసముంటున్న ఇంటిని కూల్చివేసిన బాల గురవయ్య, ఆయన కుటుంబ సభ్యులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి ఎస్.వెంకట శివ డిమాండ్ చేశారు. శివానందపురంలో కూల్చిన పిచ్చమ్మ ఇంటిని ఆదివారం వారు పరిశీలించారు. ఎలాంటి ముందస్తు సమాచారం, నోటీసులు ఇవ్వకుండా ఇంటిని కూల్చివేయడం దారుణమన్నారు. ఇంటిలోని సామాన్లను లారీలో తరలించుకుపోయారని తెలిపారు. కూల్చివేతకు ముందే బాధితురాలు పిచ్చమ్మ ఎస్పీ, రిమ్స్ సీఐలకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. దీనిపై విచారణ జరుగుతున్న సమయంలోనే జేసీబీతో ఇంటిని కూల్చారని ఆరోపించారు. తప్పుడు పత్రాలు సృష్టించి పిచ్చమ్మ ఇంటిని దౌర్జన్యంగా స్వాధీనం చేసుకోవాలని బాల గురవయ్య ప్రయత్నించారని తెలిపారు. బాధితురాలు పిచ్చమ్మకు పునరావాసం కల్పించడంతోపాటు దోషులను చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆర్‌సీపీ నాయకులు ఎం.ప్రసాద్, లక్ష్మిదేవి, భాగ్యమ్మ, విజయ్‌కుమార్, రమేష్, రవి, మద్దిలేటి, నారాయణ పాల్గొన్నారు.


కూల్చిన పిచ్చమ్మ ఇంటిని పరిశీలిస్తున్న ఆర్‌సీపీ నాయకులు

## భారతానికి జానపద శైలిని అద్దిన కళాకారులు

**కడప కల్చరల్ :** మహాభారతానికి చిత్తూరు కళాకారులు జానపద శైలితో తీర్చిదిద్దారని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అతిథి ఉపన్యాసకులు బ్రహ్మానందరెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 143వ సదస్సు «చిత్తూరు జిల్లా జానపద కళారూపాలు» అనే అంశంపై నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అతిథి ఉపన్యాసకులు బ్రహ్మానందరెడ్డి హజరై మాట్లాడుతూ చిత్తూరు జిల్లా బుర్రకథ, ధనుర్మాసపు రామభజన, పులివేషం, కీలుగుర్రాలాట, దప్పులనృత్యం, పండరిభజన, కోలాటం తదితర కళారూపాలకు ప్రసిద్ధి గాంచిందని వివరించారు. ఈ సందర్భంగా పురాణ గాథలు, కళారూపాలకు పేరుగాంచిన వివరాలను ప్రస్తావించారు. చిత్తూరు జిల్లాకు, మహాభారతానికి అవినాభావ సంబంధముందని, జిల్లాలో అనేక ప్రాంతాలు నేటికీ 'భారతం మిట్ట' అనే పేరుతో పిలువబడుతున్నాయన్నారు. రాయలసీమ కరువు ప్రాంతం కావున వర్షాలకోసం భారతంలోని విరాట పర్వాన్ని చదివించడం అనాదిగా ఒక సంప్రదాయంగా వస్తోందన్నారు. కార్యక్రమ ప్రారంభంలో వక్త బ్రహ్మానందరెడ్డిని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు ఎస్.రమేష్ రావు, జి.హరిభూషణరావు, వైవీయూ అధ్యాపకులు డాక్టర్ రాజగోపాల్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకటరమణ, సిబ్బంది కలిసి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో కొత్తపల్లె రామాంజనేయులు, సాయిబాబా, తేజ, మహేష్, దక్షిణామూర్తి, విజయకుమార్, శాంతారామ్, శ్యామసుందర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, పల్లె విజయ్, శ్రీనివాసులు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.


బ్రహ్మానందరెడ్డిని సత్కరిస్తున్న నిర్వాహకులు

## నయనం ప్రధానం


చిన్నారులతో ఓం శాంతి సంస్థ నిర్వాహకులు

**కడప కల్చరల్ :** సర్వేంద్రియానాం.. నయనం ప్రధానమని ప్రముఖ కంటి వైద్య నిపుణులు దినేష్ తెలిపారు. ఆదివారం స్థానిక ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరియా విశ్వవిద్యాలయం ఓం శాంతినగర్‌లోని సేవా కేంద్రంలో బాలల కోసం ప్రత్యేకంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు రోజుల ఈ వేసవి శిక్షణా శిబిరంలో నిర్వాహకులు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక సబ్‌జోన్ అదనపు ఇన్‌చార్జి రాజయోగిని బ్రహ్మకుమారి గీతా దీదీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కంటి వైద్యులు దినేష్ మాట్లాడుతూ విద్యార్థులు కంటి గురించి ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ దినేష్ తెలిపారు. కన్ను ఎంతో సున్నితమైన భాగమని, జాగ్రత్తలు ఎక్కువగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేకంగా చిన్నారులతో కంటికి సంబంధించిన వ్యాయామం చేయించారు. కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు కూడా పంపిణీ చేశారు. హాజరైన వంద మందికి పైగా పిల్లలు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. తాము శిబిరంలో నేర్చుకున్న అంశాలన్నింటినీ నిర్వాహకులతో పంచుకున్నారు. శిబిరంలోని రాజయోగ మెడిటేషన్ పద్ధతులను చిత్రకళ, భగవద్గీత శ్లోకాలు, ఆటపాటలు నేర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతోపాటు విజేతలైన చిన్నారులందరికీ శిక్షణా శిబిరంలో బహుమతులు, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

### మెగా బైబిల్ ఎగ్జిబిషన్ సేల్

**కడప కోటిరెడ్డి సర్కిల్:** కడప నగరంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో మెగా బైబిల్ ఎగ్జిబిషన్ సేల్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు రవికుమార్ సుభాషిని ఒక ప్రకటనలో తెలిపారు. రాజారెడ్డి వీధిలోని కృపా చర్చిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7:00 వరకు ఈ మెగా బైబిల్ సేల్ నిర్వహిస్తుమని పేర్కొన్నారు. మార్కెట్ ధరల కన్నా అతి తక్కువ ధరలలో బైబిల్లో అందుబాటులో ఉంటాయన్నారు. అలాగే 50 రకాల బైబిలు నిఘంటువులు అందుబాటులో ఉంచామని కడప నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పురాణ పాత్రలు మానవత్వానికి ప్రతిబింబం

**కడప కల్చరల్ :** మన పురాణాలన్నీ మానవత్వానికి ప్రతిబింబాలేనని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.విశ్వేశ్వరనాయుడు అన్నారు. ఆదివారం స్థానిక శ్రీ రామకృష్ణ వానప్రస్థాశ్రమంలో ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి రచించిన ।రామాయణ, భారత, భాగవతాల్లో కొన్ని పాత్రలు॥ పుస్తకాల గురించి పరిచయం చేశారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరనాయుడు మాట్లాడుతూ ఈ అంశాలలోని పాత్రలన్నీ త్యాగానికి, మానవత్వానికి, మానవత వాదానికి ప్రతీకంగా నిలిచాయన్నారు. ఈ పాత్రల్లో అన్నింటికి ఎంతో ఔన్నత్యం ఉందని తెలిపారు. డాక్టర్ జీవీ సాయి ప్రసాద్ పుస్తక పరిచయం చేస్తూ పురాణేతిహాసాల పాత్రల గుణశీలాలను ఉదాత్త రీతిలో అనుశీలించి విశ్లేషించి ఆయా వ్యక్తులను ఎందుకు ఆరాధించాలో నిరూపించారన్నారు. ప్రతి పాత్రపైన ప్రతిఫలించిన అంశాల గురించి ప్రస్తావించారన్నారు. సభాధ్యక్షులు బాబురెడ్డి మాట్లాడుతూ అచ్చమైన జ్ఞానానందం పొందడానికి మల్లికార్జున రెడ్డి ఆధ్యాత్మిక మార్గాన్ని ఉత్తమమైనదిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం అతిథులు వెంకటసుబ్బారెడ్డి, శివరామిరెడ్డి, లెక్కల కొండారెడ్డి తదితరులు మాట్లాడారు. వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అతిథులందరిని ఘనంగా సన్మానించారు. ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి తన స్పందనను తెలుపుతూ నేటి కాలానికి ఈ వ్యాసాలను అన్వయిస్తూ రాశామని తెలిపారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ తవ్వా వెంకటయ్య, జీవ కళ సత్యనారాయణ, బళ్లాని శివరాం, నాగిరెడ్డి వానప్రాస్థాశ్రమ సభ్యులు పాల్గొన్నారు.


పుస్తకాలు ఆవిష్కరిస్తున్న డీఆర్వో తదితరులు

## యునాని వైద్య కళాశాల ఏర్పాటు చేయాలి

**కడప రూరల్:** రాయలసీమలో యునాని వైద్య కళాశాలను ఏర్పాటు చేయాలని ముస్లిం సమైఖ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లో మాత్రమే యునాని వైద్య కాలేజీ ఉందన్నారు. దీంతో రాష్ట్రానికి చెందిన విద్యార్థులు ఇబ్బందులకు పడుతున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో ఆ కాలేజీని ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అలాగే కడపలో నిరుపయోగంగా ఉన్న హజ్ హౌస్‌ను ఉపయోగంలోకి తేవాలని కోరారు. మహానాడులో వైఎస్సార్ కడపతో పాటు రాయలసీమ ప్రాంత జిల్లాల అభివృద్ధికి ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఖలీలుల్లా, నవాజ్‌వుల్లా పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ సలావుద్దీన్

## విజిలెన్స్ సెక్యూరిటీ నూతన జోనల్ కమిటీ ఎన్నిక

**కడప కోటిరెడ్డి సర్కిల్ :** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్ కడప జోన్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన జోనల్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కడప, అనంతపురం, కర్నూలు రీజనల్ కమిటీలను స్టేట్ అడక్ కమిటీ కన్వీనర్ టీవీ రావు ఆధ్వర్యంలో నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. జోనల్ గౌరవ అధ్యక్షులుగా పి.చిన్నగంగన్న, జోనల్ ప్రెసిడెంట్‌గా ప్రొద్దుటూరు డిపో హెడ్ కానిస్టేబుల్ బి.రఘునాథరెడ్డిని, జోనల్ సెక్రటరీగా మైదుకూరు డిపో హెడ్‌కానిస్టేబుల్ ఏవీపీ నాయుడు, రాయదుర్గం డిపో కానిస్టేబుల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ నూతన కమిటీగా ఎన్నికైన వారు సంస్థ పురోభివృద్ధికి పాటుపడాలని సూచించారు.


నూతన కమిటీతో విజిలెన్స్ సెక్యూరిటీ సిబ్బంది

## మానవసేవ పరమాత్ముని సేవ

**కడప సెవెన్‌రోడ్స్ :** మానవసేవ పరమాత్ముని సేవగా ప్రతిఒక్కరూ భావించాలని మానవత సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో డాక్టర్ సి.సుబ్బారెడ్డి అధ్యక్షతన ఆ సంస్థ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మానవత సంస్థ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కోరారు. కేంద్ర కమిటీ డైరెక్టర్ డాక్టర్ రామాంజులు రెడ్డి మాట్లాడుతూ దాతల సహకారంతో వేసవిలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాలు కొనసాగించామని తెలిపారు. క్రిమిటోరియం పనులు చురుగ్గా సాగుతున్నాయని, త్వరలో వాటిని పూర్తి చేసి మానవత సంస్థకు అప్పగిస్తామని డైరెక్టర్ గోపి అన్నారు. సభ్యత్వాలు ఈ ఏడాది తప్పనిసరిగా పెంచుతామని పీఆర్‌ఓ సుబ్బరాయుడు తెలిపారు. సంస్థ కార్యకలాపాలను దృష్టిలో ఉంచుకుని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు సభ్యత్వాలు తీసుకోవాలని కోరారు. ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం, డాక్టర్ మద్దిక సుబ్బారెడ్డి, కృష్ణారావు, బీవీ సుబ్బరాయుడు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ సుబ్బారెడ్డి

## స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

**ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) :** ఎర్రగుంట్ల పరిసర ప్రాంతాల్లో ఉన్న సిమెంట్ పరిశ్రమలలో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంట్ పరిశ్రమల ఏర్పాటు కోసం రైతుల నుంచి భూమి, ప్రభుత్వం నుంచి రాయితీలు పొంది స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా పరిశ్రమ నుంచి వెలువడే విష వాయువులతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. కాలుష్య నియంత్రణ సరిగ్గా చేయకపోవడం వలన ఎర్రగుంట్ల పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలు పడుతున్నారు.

## పందుల రాజ్యం.. పట్టని అధికారగణం!





పందులు ప్రాణాంతక వ్యాధులకు కేరాఫ్...అవి సంచరించే చోట రోగాలు చాపకింద నీరేనన్నది జగమెరిగిన సత్యం. కడప నగరంలో వరాహాలు ప్రజల గుండెల్లో వణుకుపుట్టిస్తున్నాయి జనవాసాల మధ్యన గుంపు గుంపులుగా సంచరిస్తున్నాయి. మురుగు గుంటలు, చెత్తకుప్పలను ఆవాసాలుగా చేసుకున్నాయి. వీధుల్లో విచ్చలవిడిగా సంచరిస్తుండడంతో ఎప్పుడు ఏ వ్యాధి బారిన పడతామోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కడప నగర శివార్లలోని ఇందిరానగర్‌లో కాలనీవాసులు కొందరు రోడ్డుపై చెత్తాచెదారం వేయడంతో అపరిశుభ్రంగా మారుతుంది. దీంతో చుట్టుపక్కల ఉన్న పందులతోపాటు ఆవులు అక్కడికి చేరి ఆపరిశుభ్రంగా మారుస్తున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. దీంతో చిన్నపాటి గాలి వీచినా కంపు కొడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా రోడ్డుకు పక్కనే కావడంతో ఆ దారిన వెళ్లేవాళ్లకు దుర్వాసనను భరించలేకపోతున్నారు. అంతేకాదు వీధుల్లో విచ్చలవిడిగా సంచరిస్తుండడంతో ఎప్పుడు ఏ వ్యాధిబారిన పడతామోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వ్యాధులకు కారకమైన వీటిని అధికారులు పట్టించుకునే పాపానికి పోవడం లేదు. – కడప ఎడ్యుకేషన్

### కనుల పండువగా శివపార్వతుల కల్యాణోత్సవం


కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మాస శివరాత్రి పర్వదిన సందర్భంగా అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌లకు విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. గోపూజ, రుద్రహోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగా, రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి కాలక్షేప మండపంలోని కల్యాణ వేదికపై ఆశీనులను చేశారు. సుమూహూర్తంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవోపేతంగా కల్యాణోత్సవాన్ని జరిపారు.